ఈ రోడ్లు.. నరకానికి నకళ్లు

- నీటి మూటలైన పాలకుల మాటలు
- మెజార్టీ రోడ్లు మరమ్మతులకు నోచుకోని వైనం

యలమంచిలి: సంక్రాంతి నాటికి గతుకులు లేని రోడ్లు చూపిస్తామని ఎన్నికలకు ముందు ప్రగల్భాలు పలికిన కూటమి నేతలు అధికారం చేపట్టి ఏడాది గడచినా మాట నెలబెట్టుకోకపోవడంపై గ్రామీణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఉన్న రహదారుల్లో పాలకొల్లు–దొడ్డిపట్ల, మేడపాడు–ఏనుగువానిలంక ఆర్‌అండ్‌బీ రోడ్లు ప్రధానమైనవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలకొల్లు–దొడ్డిపట్ల ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అరకొరగానైనా మరమ్మతులు చేశారు. కానీ మేడపాడు–ఏనుగువానిలంక ఆర్‌అండ్‌బీ రోడ్డును మాత్రం అసలు పట్టించుకోలేదు. ఈ రోడ్డుకు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద, ఏనుగువానిలంక ఎంట్రన్స్‌లో పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. ఈ ఏడాది కాలంలో ఈ రోడ్డుపై కనీసం తట్టడు గ్రావెల్ కూడా వేయలేదు. దీంతో ఈ రోడ్లపై ప్రయాణించడానికి ప్రజలు నరకయాతన పడుతున్నారు. పైగా ఈ రోడ్డుపై వేసవి కాలమంతా ట్రాక్టర్లు, లారీలపై విపరీతంగా మట్టి రవాణా చేశారు. ఆ సమయంలో రోడ్లపై పడిన మట్టిని తొలగించకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా బురదమయమై ప్రయాణికులు, ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

కాంబొట్లపాలెం రోడ్డు దుస్థితి

సీతమ్మచెరువు, కాంబొట్లపాలెం వెళ్లే రోడ్డు రెండు గ్రామాల ప్రజలకు నరకం చూపుతుంది. కొద్దిపాటి చినుకులు పడిన రోడ్డంతా బురదమయం అవుతుంది. కనీసం పాదచారులు కూడా నడవడానికి వీలులేనంతగా రోడ్డు మారుతుంది. దీంతో కాంబొట్లపాలెం గ్రామ ప్రజలు అదనపు దూరమైన గుంపర్రు మీదుగా ప్రయాణం సాగిస్తున్నారు. అయితే ఈ రోడ్డుపై సోషల్ మీడియాలో అనేక వీడియోలు వస్తున్నాయి. ఈ వీడియోలపై కూటమి నాయకులు స్పందిస్తూ గత ప్రభుత్వ వైఫల్యమని విమర్శించడాన్ని కాంబొట్లపాలెం ప్రజలు తప్పుపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఆత్మస్తుతి పరనింద అన్నట్టు రోడ్డు వేయకుండా ఇంకా గత ప్రభుత్వం తప్పిదమని ఆరోపించడం సమంసజం కాదని, రోడ్డు వేసి ప్రజలకు మేలు చేయాలని కోరుతున్నారు. ఈ రోడ్లే కాకుండా మేడపాడు–పెనుమర్రు, కట్టుపాలెం–పెనుమర్రు రోడ్డులు కూడా అధ్వానంగా తయారయ్యాయి. పెనుమర్రు గ్రామ ప్రజలు తమ దైనందిన అవసరాల కోసం నిత్యం ఈ రెండు రోడ్డుల గుండానే బాహ్య ప్రపంచంలోనికి రావాలి. రెండు రోడ్డులు కూడా ధ్వంసం కావడంతో పెనుమర్రు గ్రామ ప్రజలు గ్రామం నుంచి బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి రోడ్డులు బాగు చేయాలని పెనుమర్రు గ్రామ ప్రజలు కోరుతున్నారు.


ఏనుగువానిలంకలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి


కాంబొట్లపాలెంలో బురదమయమైన రోడ్డు

తట్ట గ్రావెల్ కూడా వేయలేదు



మా గ్రామం రావడానికి నరసాపురం వైపు నుంచి ఒకటి, చించినాడ వైపు నుంచి మరొకటి ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. రెండు రోడ్డులు కూడా అధ్వానంగా ఉన్నాయి. ప్రధానంగా చించినాడ వైపు రోడ్డుకు పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. కొద్దిపాటి వర్షం కురిసిన వారం వరకు గోతుల్లో నీరు ఉండిపోతుంది. దీంతో వాహనాలపై వెళ్లే ప్రయాణికులంతా ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయ్యింది. అయినా కొత్త రోడ్డు నిర్మాణం అటుంచి, కనీసం రోడ్డు మరమ్మతుకు ఇంతవరకు కనీసం తట్ట గ్రావెల్ కూడా వేయలేదు.

– పాలపర్తి సందీప్, ఏనుగువానిలంక

మా ఊరు రావాలంటే హడలెత్తిపోతున్నారు



పూర్వ కాలంలో కాంబొట్లపాలెం గ్రామానికి రోడ్డులేని సమయంలో మా తాతలు సైకిల్ నెత్తి మీద పెట్టుకుని దొడ్డిపట్ల రోడ్డు ఎక్కాక ప్రయాణించే వారంట. ఇప్పుడు మా పరిస్థితి ఆ విధంగా మారింది. కొద్దిపాటి చినుకులు పడినా రోడ్డు బురదవుతూ ప్రమాదకరంగా మారుతుంది. దీంతో ప్రజలు రోడ్డు మీద ప్రయాణం చేయడానికి హడలెత్తిపోతున్నారు. ఇక ఆటోలు, రవాణా వాహనాలు వారయితే కాంబొట్లపాలెం పేరు చెపితే కిరాయికి కూడా రావడం లేదు.

– పార్శి నవీన్, కాంబొట్లపాలెం

అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి


పెనుమంచిలిలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: అమరవీరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ పిలుపు నిచ్చారు. ఆచంట మండలంలో పెనుమంచిలి, ఆచంట వేమవరంల్లో అమరవీరులు నార్గన నరసింహమూర్తి, పంది నరసింహమూర్తి, కరటూరి సత్యనారాయణ సంతాప సభలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిర్రా నరసింహమూర్తి, గుత్తుల రంగారావు, నెక్కంటికృష్ణమూర్తి, పెచ్చెట్టి సత్యనారాయణ, కొండేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

గంగాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగాలమ్మ

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో ఉన్న శ్రీ గంగాలమ్మ వారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించి నైవేథ్యాలు సమర్పించారు.

క్లుప్తంగా

స్వర కిరీటి పురస్కారం అందజేత


గీతా మహాలక్ష్మిని స్వరకిరీటితో సత్కరిస్తున్న కళావేదిక సభ్యులు

పెనుగొండ: మండలంలోని ములపర్రుకు చెందిన ప్రముఖ రచయిత్రి, గాయనీ గుండాల గీతామహాలక్ష్మిని ఏలూరులో శ్రీకళావేదిక తెలుగు అసోషియేషన్ ఆఫ్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సింగర్స్ ఫెస్ట్–2025లో స్వరకిరీటి పురస్కారంతో సత్కరించారు. ఆదివారం పెనుగొండలో విలేకర్లతో మాట్లాడుతూ నాన్‌స్టాప్ ట్రాక్ సింగింగ్ నిర్వహించిన కార్యక్రమంలో స్వరకిరీటి జాతీయ పురస్కారాన్ని అందించారన్నారు. గుండాల గీతా మహాలక్ష్మిని పలువురు అభినందించారు.

ఇంటింటికీ ఉచిత వైద్యం


వృద్ధురాలికి వైద్యసేవలందిస్తున్న డాక్టర్ హుస్సేన్ అహ్మద్

తణుకు అర్బన్ : సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్య సేవలు అందించారు. తణుకు, పైడిపర్రు, మండపాక ప్రాంతాల్లో ఇంటికే పరిమితమైన వృద్ధులకు ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య ప్రత్యేక వాహనం ద్వారా 10 మంది వృద్ధుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. అసోసియేషన్ సభ్యులు యడ్లపల్లి శివప్రసాద్ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్య సేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి అర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మెంబర్ షిప్ చైర్‌పర్సన్, దాత వేగేశ్న రామరాజు ఆధ్వర్యంలో ఆదివారం పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు పర్యవేక్షించారు. లార్డ్స్ ఆఫ్ లైఫ్ చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. భవిత దివ్యాంగుల సెంటర్‌లో స్టేషనరీ ఇచ్చారు. చెన్నారెడ్డి సతీష్, డైమండ్స్ సభ్యులు జొన్నల సతీష్‌కుమార్, కోటి విజయ్‌కిషోర్, ఆకుల సతీష్, కన్నాజీ శ్రీనివాస్, ఏడుకొండలు, కె.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు ఘరానా మోసం

తణుకు అర్బన్: సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు ప్రజలను ఘరానాగా మోసం చేసి అధికారాన్ని చేజిక్కించుకున్నారని వైఎస్సార్ సీపీ తణుకు మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి అన్నారు. తణుకు మండలం మండపాక శివారులోని ఎర్రనీలిగుంటలో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబుకు ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టే ధోరణితో మాట్లాడి మోసం చేసే గుణం ఉందని ప్రజలకు తెలిసికూడా మోసపోతూనే ఉన్నారన్నారు. ముఖ్యంగా ఇంటి గుమ్మంలోకివచ్చే రేషన్ వాహనాలను నిలిపి వేసి పాత రోజుల్లో మాదిరిగా రేషన్ దుకాణాలకు వెళ్లి తెచ్చుకునే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారని విమర్శించారు. వలంటీర్ల సేవలకు మంగళం పాడి పేదలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని, నేడు ఏ కార్యాలయానికి వెళ్లినా పనులు అవ్వక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్పష్టం చేశారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న స మాచారం మేరకు ఆదివారం ఒక కేసు నమోదు చేసి ముద్దాయిను అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి, సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలో పలు ప్రదేశాల్లో దాడులు నిర్వహించారు. మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 7 మద్యం సీసాలు స్వాధీ నం చేసుకున్నట్లు స్టేషన్ అధికారులు వెల్లడించారు.

చెస్ విజేతకు అభినందనలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ స్టేట్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ వారిచే రాజమండ్రిలో ఆదివారం చెస్ కాంపిటీషన్ నిర్వహించారు. ఇందులో భారతీయ విద్యా భవన్స్ విద్యార్థి, తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన క్రీడాకారుడు వంగపండు బాలశ్రీ కార్తీక్ అండర్–12 బాలుర విభాగంలో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించాడు. భారతీయ విద్యా భవన్స్ యాజమాన్యం, చెస్ కోచ్ ప్రదీప్‌లు అభినందించారు.

ఆంక్షలతో ఉచిత బస్సు పథకం సిగ్గుచేటు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కర్రా జయసరిత

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలతో కూడిన మహిళల ఉచిత బస్సు పథకం అమలు చేయడం సిగ్గుచేటని రాష్ట్ర వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత ప్రశ్నించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాల్లో మహిళలకు ఉచిత బస్ పథకం ఒకటని అన్నారు. అయితే రాష్ట్రంలో 12 వేల బస్‌లు ఉంటే వాటిలో 6 వేల బస్‌ల్లో మాత్రమే ఉచిత బస్ ప్రయాణం ఉంటుందని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ బస్సుల్లో కనీసం జిల్లా కూడా దాటని బస్సులు చాలా ఉన్నాయని, కొన్ని 30, 40 కి.మీ మించి వెళ్లని బస్సులు ఉన్నాయని అన్నారు. ఉచిత బస్ పథకం ద్వారా ఎందరో మహిళలు తీర్థ యాత్రలుచేయాలని ఆలోచనల్లో ఉన్నారని మరి అలాంటి వారి ఆశలు ఆడియాసలు అయినట్లేనని విమర్శించారు. ఇలా అమలు చేయలేని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి ప్రజలకు న్యాయం చేయాలనే సంకల్పమే లేదన్నారు. అధికారంలోకి రావడానికి రాజకీయ నాయకులు అనేక హామీలు ఇస్తుంటారని కాని వాటిని అమలు చేసే ధైర్యం, సత్తా ఉన్నావాడే ప్రజానాయకుడు అవుతాడని ఆ నాయకత్వ లక్షణం ఒక్క జగనన్నకే సాధ్యమని మరోసారి రుజువైందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు పెచ్చెట్టి కృష్ణాజీ, జోగాడ ఉమామహేశ్వరరావు, దేవ రాజేష్, వీరా మల్లిఖార్జునుడు, మామిడిశెట్టి చిట్టిబాబు, రాపాక శివకుమార్, వాసంశెట్టి సుబ్బారాయుడు, పెచ్చెట్టి లక్ష్మీవిమల, పసుపులేటి కుమారి, పసుపులేటి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరంలో ఉచిత ధ్యాన శిక్షణ


ధ్యాన శిక్షణ ఇస్తున్న దృశ్యం

వీరవాసరం: వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీసీతారామస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం ఉచిత ధ్యానశిక్షణ కార్యకమాన్ని నిర్వహించారు. ఏలూరుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ రాధ జోశ్యుల పాల్గొని ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె ధ్యానం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. 2004 నుంచి 2022 వరకు పత్రీజీతో తన ప్రయాణ విశేషాలతో పాటు ద్వారకాతిరుమల శ్రీ శ్రీనివాస స్పిరిచ్యువల్ సైన్స్ అకాడమీలో జరిగే కార్యక్రమ విశేషాలను తెలియజేసి అందరితో సామూహిక ధ్యానం చేయించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ సెప్టెంబరు 16 నుంచి 22వ తేదీ వరకు ప్రపంచ శాంతి కోసం తిరుపతిలో నిర్వహించే ధ్యాన మహాయజ్ఞంలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మేడిశెట్టి కృష్ణారావు, ఉదయ్, పంజా రాంబాబు, శ్రీదేవి, యర్రాయమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ఏబీవీపీ కృషి


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కృషి చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. భీమవరంలో ఆదివారం ప్రారంభమైన ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల తొలిరోజు కార్యక్రమానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఎదురైనా దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత విద్యార్థి నాయకులపై ఉందని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలుగన్న వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో ప్రతి ఒక్క విద్యార్థి నాయకుడూ భాగస్వామి కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. సంఘ రాష్ట్ర నేతలు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు.

మోదీకి పట్టని ట్రంప్ సుంకాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బలరామ్

ఆకివీడు: మన దేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలతో ఆక్వా రంగం ఆర్థికంగా కుదేలయ్యే పరిస్థితి ఏర్పడిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యులు బీ.బలరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రంప్ తీసుకొచ్చిన సుంకాలను ఎదుర్కోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఏకపక్షంగా దిగుమతి సుంకాలు పెంచడం వల్ల భారతీయ ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. 50 శాతం దిగుమతి సుంకాల నిర్ణయంతో భారత ఆర్థిక రంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. ముఖ్యంగా ఆక్వా రైతాంగం తీవ్ర నష్టానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ట్రంప్ టారిఫ్ ప్రకటించిన తరువాత 100 కౌంట్ రొయ్యల ధర రూ.60, 70లకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.280 ధర రూ. 220లకు దిగిపోయిందన్నారు. సంక్షోభాన్ని పరిష్కరించడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని బలరామ్ ఆరోపించారు. ప్రధాని మోదీ ప్రకటనలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. రొయ్యల సాగు చేసే రైతులకు నాణ్యమైన సీడు, ఫీడు దొరకక తీవ్ర నష్టాలకు గురవుతున్నారన్నారు. సీడ్, ఫీడ్ ధరల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

నరసాపురంలో క్షీణిస్తున్న పారిశుద్ధ్యం


పొన్నపల్లిలో సిల్ట్ తీయకపోవడంతో పొంగుతున్న డ్రెయిన్

నరసాపురం: పట్టణంలో పారిశుద్ధ్యం దారుణంగా క్షీణిస్తోంది. పట్టణంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన పురపాలకులు నిర్లక్ష్యం చూపిస్తున్నారు. దీంతో పట్టణ వాసులు అనేక అవస్థలు పడుతున్నారు. రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి, మొదటి నుంచీ ఇబ్బందులు ఉన్నాయి. అయితే పరిస్థితిని సరిచేసే ప్రయత్నం చేయడం లేదు. మొత్తం పట్టణంలో 60 వేలు జనాభా ఉంది. 31 వార్డులతో పట్టణం విస్తరించి ఉంది. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ అంతా అంతా కలిపి 150 మంది పారిశుద్ధ్య నిర్వహణలో పని చేస్తున్నారు. అయితే కొన్ని రోజుల నుంచి చెత్తసేకరణ నుంచి, డ్రెయిన్స్ శుభ్రం చేయడం వరకూ ఏ పనులూ సవ్యంగా సాగడంలేదు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాలు పడుతుండటంతో పరిస్థితి మరింత క్షీణించింది. రుస్తుంబాధ, రాయిపేట, వైఎస్సార్ నగర్, నందమూరికాలనీ, ఎన్టీఆర్ కాలనీ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. కీలకమైన మార్కెట్ ప్రాంతం, స్టీమర్‌రోడ్డు, కోర్టువీధి, ప్రకాశం రోడ్డు ప్రాంతాల్లో కూడా పొంగుతున్న డ్రెయిన్లు, రోడ్డు పక్క చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి.

శానిటరీ సిబ్బంది పనితీరుపై విమర్శలు

శానిటేషన్ శాఖ పనితీరుపై కూడా విమర్శలు వస్తున్నాయి. పట్టణంలో రెండు శానిటరీ డివిజన్లు ఉన్నాయి. శానిటరీ అధికారులు, సిబ్బంది పనితీరు అధ్వానంగా ఉంది. మున్సిపల్ అధికారులు పరిస్థితిని చక్కబెట్టే ప్రయత్నం కూడా చేయకపోవడం గమనార్హం. రోడ్డు పక్క పిచ్చిమొక్కలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. కనీసం రోడ్డుపక్క పిచ్చిమొక్కలను తొలగించలేని స్థితిలో పారిశుద్ధ్యం ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పట్టణంలో దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. ఇక డ్రెయిన్స్ పరిస్థితి అయితే మరింత అధ్వానంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేవారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యా దులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

నరసాపురం రూరల్: మండలంలోని సరిపల్లి గ్రామ శివారు ప్రాంతంలో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసినట్లు నరసాపురం రూరల్ ఎస్‌ఐ టి.వెంకట సురేశ్ తెలిపారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని, రూ.8700నగదు, పేక ముక్కలు, 3 ఫోన్లులు, 3 మోటార్ సైకిల్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ఉత్సాహంగా మావుళ్లమ్మ జాతర

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని 14, 18, 25, 26వ వార్డు, సుంకర పద్దయ్య వీధిలోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద అమ్మవారి జాతర మహోత్సవాలను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

తెన్నేటి బోధామృత శ్రీకృష్ణ గీత ఆవిష్కరణ

పాలకోడేరు: తెన్నేటి బోధామృత శ్రీకృష్ణ గీత గ్రంథాన్ని ఆదివారం కృష్ణా జిల్లా పెదముత్తేవిలోని శ్రీకృష్ణ ఆశ్రమంలో ముముక్షు జన మహీ పీఠములో ముత్తేవి గౌర కృష్ణ ఆవిష్కరించారు. పాలకోడేరుకు చెందిన రచయిత, కవి, ఆధ్యాత్మిక ప్రవచన కర్త తెన్నేటి లక్ష్మీనృసింహమూర్తి ఈ గ్రంథాన్ని రాశారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీత ఎందుకు చదవాలి, ఆచరణలో ఎలా ఉండాలి వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో తెన్నేటి సతీమణి రమా ప్రతిభ, ఉపాధ్యాయురాలు భవాని, ధార్మిక సేవా కార్యకర్త తుర్లపాటి రాధా, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఏపీ రజక చైతన్య సేవా సంస్థ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నాడ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ ఆఫీస్‌లో ఆదివారం రజక చైతన్య సేవా సంస్థ నియోజకవర్గం సమావేశం నిర్వహించారు. జొన్నాడ శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ–ఏలో ఉన్న రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో తీర్మానం చేసి వెంటనే కేంద్రానికి పంపించాలని డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో రజకులు వెనుకబడి ఉన్నారని, హక్కుల సాధనకు రజకులు ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అధ్యక్షులు బోగెల్లి రాంబాబు అధ్యక్షత వహించారు. సమావేశంలో రూరల్ మండల కమిటీ, పట్టణ కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పట్టణ అధ్యక్షుడిగా నారాయణపురపు నరసింహరావు, ఉపాధ్యక్షుడిగా సోమవరపు రాము, సెక్రటరీగా కట్టుంగ నరసింహం, జాయింట్ సెక్రటరీగా మానేపల్లి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కోటిచుక్కల అవతారం, కోశాధికారిగా మడిచిర్ల సుబ్బారావులు ఎన్నికయ్యారు.

అనారోగ్య బాలుడికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న జై భీమ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన ఎస్.సోమేశ్వరరావు మనవడు మూడేళ్ల లోక్ నందన్ గత కొన్ని రోజులుగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. గత కొన్ని రోజులుగా విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి వైద్యం కోసం ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంది. ఈ విషయం తెలుసుకున్న జీవీఎస్‌వీఆర్‌ఎం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ బాలుడి పరిస్థితిని జై భీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులకు వివరించారు. దీంతో జై భీమ్ సంస్థ వ్యవస్థాపకులు గెడ్డం సునీల్ గవాస్కర్ స్పందించి ఆదివారం రూ. 12 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ సభ్యులు బుంగ సంసోన్, కవి కోలాటి పెద్దిరాజు, తాడి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు కల్వర్టు


ప్రమాదకరంగా ఉన్న రోడ్డు కల్వర్టు

ఉండి: ఉండి, పాములపర్రు సరిహద్దులో ఉండి గణపవరం రోడ్డులో రహదారి పక్కనే ఉన్న ఓ కల్వర్టు వాహనదారులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఉండి శివారు పాములపర్రు సరిహద్దులో సరిగ్గా రోడ్డు మలుపులో మైనర్ డ్రెయిన్‌పై ఉన్న ఈ కల్వర్టుకు రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. రహదారికి ఒకవైపు బొండాడ మేజర్ డ్రెయిన్ ఉండగా దానిలో పడకుండా వాహనదారులు ఎక్కువగా కల్వర్టువైపే వాహనాలు నడుపుతుంటారని స్థానికులు చెబుతున్నారు. నిత్యం ఉండి నుంచి తాడేపల్లిగూడెం, గణపవరం తదితర ప్రాంతాలకు వందలాది భారీ వాహనాలు, బస్సులు, ద్విచక్ర వాహనాలపై ఈ రహదారి గుండా ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈ రహదారిలో ప్రమాదకరంగా మారిన కల్వర్టుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.